మంచు చరియల కింద 25 ప్రాణాలు

- బద్రీనాథ్‌లో చరియలు విరిగిపడి చిక్కుకున్న 57 మంది కార్మికులు
- 32 మందిని రక్షించిన సిబ్బంది
- ఉత్తరాఖండ్ చమోలీలో దుర్ఘటన

చమోలీ జిల్లాలో విరిగిన చరియల వద్ద రెస్క్యూ టీమ్ సభ్యుల సహాయక చర్యలు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో మంచు చరియలు బీభత్సం సృష్టించాయి. గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న హిమపాతం సరిహద్దు ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నది. ఈ క్రమంలో చమేలి జిల్లాలోని మన అనే సరిహద్దు గ్రామంలో చమోలి-బద్రీనాథ్ రహదారిపై ఏర్పాటు చేసిన శిబిరంపై పెద్దయెత్తున మంచు చరియలు విరుచుకు పడటంతో అక్కడ పనిచేస్తున్న 57 మంది బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) కార్మికులు చిక్కుకుపోయారు. శుక్రవారం ఉదయం 7.15 గంటలకు ఇది చోటుచేసుకోగా, ఆ సమయానికి కార్మికులు ఎనిమిది కంటైనర్లు, ఒక షెడ్‌లో ఉన్నారు. దీంతో అధికారులు అప్రమత్తమై వారిని బయటకు తీసేందుకు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. అధికారుల కథనం ప్రకారం ఇప్పటివరకు 32 మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చి, గ్రామంలో ఏర్పాటు చేసిన ఐటీబీపీ శిబిరంలో చికిత్స అందిస్తున్నారు. వారిలో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రతికూల వాతావరణం, భారీ హిమపాతం ఏర్పడే ప్రమాదం ఉండటంతో సహాయ కార్యక్రమాలు తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో మిగిలిన 25 మంది కార్మికుల గురించి ఆందోళన వ్యక్తమవుతున్నది. బద్రీనాథ్‌లో జరిగిన ప్రమాదంలో మంచు చరియల కింద చిక్కుకున్న వారినందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

టూత్‌పేస్ట్ తిని ప్రాణం నిలుపుకున్నాడు!

చైనాలోని కిన్‌లింగ్ పర్వతారోహణ కోసం ఫిబ్రవరి 8న బయల్దేరిన సున్ లియాంగ్ (18) అతి కష్టం మీద ప్రాణాలతో బయటపడ్డాడు. ఎలక్ట్రానిక్ డివైసెస్ పనిచేయకపోవడంతో బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. చేసేదేమీ లేక నెమ్మదిగా కిందకు దిగడం ప్రారంభించాడు. చాలాసార్లు పట్టు తప్పి, పడిపోయాడు. కుడి చేయి ఎముక విరిగిపోయింది కూడా. ఆహారం లేకపోవడంతో మంచును, టూత్‌పేస్ట్‌ను తింటూ కాలం గడిపాడు. 10 రోజుల తర్వాత అతడిని రెస్క్యూ సిబ్బంది రక్షించారు.

పీఎఫ్ వడ్డీ రేట్లలో మార్పు లేదు

ఈ ఏడాది కూడా 8.25 శాతమే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) ఉద్యోగుల డిపాజిట్లపై చెల్లించే వడ్డీ మొత్తాన్ని 8.25 శాతంగానే స్థిరీకరించింది. 2024-25 సంవత్సరానికి గాను 7 కోట్ల సభ్యులున్న ఉద్యోగుల భవిష్య నిధి మొత్తాలపై 8.25 శాతం వడ్డీ చెల్లించనున్నదని అధికార వర్గాలు పేర్కొన్నాయి. 2022-23లో 8.15 శాతం ఉన్న వడ్డీ రేటును 2023-24కు 8.25 శాతానికి పెంచుతున్నట్టు గత ఏడాది ప్రకటించింది. ఈ ఏడాది కూడా అదే వడ్డీ రేటును కొనసాగించనున్నట్టు తెలుస్తున్నది. 2020-21లో కూడా ఇదే వడ్డీ రేటు ఉండగా కరోనా కారణంగా దేశ ఆర్థిక పరిస్థితి మందగించడంతో మార్చి 2022లో 8.1 శాతానికి తగ్గించింది.

మహిళా సర్పంచులపై పెత్తనం చేసే భర్తలకు జరిమానా

కేంద్ర ప్రభుత్వ కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: మనదేశంలోని చాలా గ్రామాల్లో పేరుకే మహిళా సర్పంచి. అధికారం అంతా భర్తలు లేదా తండ్రులదే. ఇలా పరోక్షంగా పెత్తనం చేస్తూ, మహిళా సాధికారతను దెబ్బతీస్తున్న పురుషులపై జరిమానాలు విధించాలని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టు సలహా మేరకు విశ్రాంత ఐఏఎస్ అధికారి సుశీల్ కుమార్ అధ్యక్షతన కేంద్రం ఈ కమిటీని వేసింది. ఇది ఇటీవల పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖకు తన నివేదికను సమర్పించింది. ఇందులో భర్తలు, తండ్రులు, ఇతర పురుష బంధువుల పాత్రను నిరోధించాలంటే మహిళలకు వ్యవస్థాగతంగా ప్రభుత్వం అండగా నిలవాలని పేర్కొన్నది. ఎన్నికైన మహిళా ప్రతినిధులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటుచేయాలని, పాలనలో వారికి ఎదురయ్యే సమస్యలు పరిష్కరించేందుక ఒక వ్యవస్థను తీసుకురావాలని కమిటీ సూచించింది.

దేవుడా.. నువ్వే కాపాడాలి!

- ప్రభుత్వాన్ని నడిపించలేని స్థితికి హిమాచల్ కాంగ్రెస్
- ఆలయ ట్రస్టులు విరాళాలు ఇవ్వాలంటూ అభ్యర్థన
- సంక్షేమ పథకాలను కొనసాగించడానికేనని వివరణ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడుతున్న ప్రతిపక్షాలు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): పది గ్యారెంటీల పేరిట అడ్డగోలు హామీలిచ్చి హిమాచల్ ప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రాష్ర్టాన్ని దివాలా అంచులో నిలబెట్టింది. హామీల అమలు పేరిట ఇప్పటికే కొత్త అప్పులు చేస్తూ.. ప్రభుత్వోద్యోగుల జీతాలను పెండింగ్‌లో ఉంచిన సుఖ్విందర్ సింగ్ సుఖు సర్కారు చివరకు పింఛనర్ల సంక్షేమ నిధి డబ్బులను కూడా వాడుకొన్నది. ఇప్పుడు తాజాగా దేవుడి సొమ్మునూ వదలట్లేదు. ప్రభుత్వ పథకాలను కొనసాగించడానికి ఖజానాలో సొమ్ములేదన్న ప్రభుత్వం.. రాష్ట్రంలోని ఆలయాల ట్రస్టులు స్వచ్ఛందంగా విరాళాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. పేద విద్యార్థుల కోసమని తాము ప్రారంభించిన ముఖ్యమంత్రి సుఖ్‌ఆశ్రయ్ యోజన, ముఖ్యమంత్రి సుఖ్ శిక్షా యోజన పథకాలను ఆలయ ట్రస్టులు అందజేసే విరాళాలతో కొనసాగిస్తామని వెల్లడించింది. ఈ మేరకు జనవరి 29న ప్రభుత్వం ఓ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రకృతి విపత్తులతో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం నెలకొన్నట్టు చెప్పుకొచ్చింది.

మండిపడ్డ విపక్షాలు

సుఖు ప్రభుత్వం తీసుకొన్న తాజా నిర్ణయం తమను షాక్‌కి గురిచేసిందని బీజేపీ నేత, మాజీ సీఎం జైరామ్ ఠాకూర్ అన్నారు. ప్రభుత్వ పథకాల కోసం గతంలో ఏ సర్కారూ ఆలయాల సొమ్మును వినియోగించలేదని గుర్తుచేశారు. కాగా అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు కాకముందే రాష్ర్టాన్ని కాంగ్రెస్ సర్కారు ఆర్థికంగా కుదేలయ్యేలా చేసిందన్న విమర్శలు పెద్దయెత్తున వ్యక్తమవుతున్నాయి. దేశంలో తలసరి అప్పు ఎక్కువగా ఉన్న రాష్ర్టాల్లో హిమాచల్ ప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ఈ రాష్ట్రం అప్పు రూ.95 వేల కోట్లకు చేరినట్టు ఆర్థిక విశ్లేషకులు చెబుతుండటం గమనార్హం.

ఈసారీ మండిపోనున్న ఎండలు!

- మార్చి నుంచి మే నెల వరకు సాధారణం కన్నా అధికం

న్యూఢిల్లీ: ఈసారీ వేసవి మండిపోనున్నదని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుక్రవారం వెల్లడించింది. దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో మార్చి నెలలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. కనిష్ట, గరిష్ఠ ఉష్ణోగ్రతలు సగటుకు మించిపోతాయని తెలిపింది. మార్చి నుంచి మే నెల వరకు ఇదే ధోరణి కొనసాగుతుందని తెలిపింది. అయితే, దక్షిణాది, ఈశాన్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం నుంచి సాధారణం కన్నా తక్కువగా నమోదుకావచ్చునని వివరించింది. 1901 నుంచి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలల్లో నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలించినపుడు ఈ ఏడాది ఫిబ్రవరిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ వద్దు

- దక్షిణాదికి అన్యాయం చేయొద్దు
- అలా చేస్తే తప్పక ప్రతిఘటిస్తాం
- కేంద్రానికి ఎంకే స్టాలిన్ హెచ్చరిక

చెన్నై: జనాభా ప్రాతిపాదికన నియోజకవర్గాల పునర్విభజన చేసి దక్షిణాది రాష్ర్టాలను శిక్షించొద్దని, అలా చేస్తే తాము తీవ్రంగా ప్రతిఘటిస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కేంద్రాన్ని హెచ్చరించారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను అన్యాయంగా జనాభా ప్రాతిపాదికన చేస్తే తమిళనాడు, డీఎంకే ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించదని స్పష్టం చేశారు. క్రమశిక్షణతో జనాభా నియంత్రణకు సహకరించిన దక్షిణాది రాష్ర్టాలకు మీరు ఇస్తున్న ప్రతిఫలం ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. తన 72వ పుట్టినరోజు సందర్భంగా ఆయన శుక్రవారం పార్టీ వర్గాలతో మాట్లాడుతూ తమిళనాడు సంక్షేమానికి, భవిష్యత్‌కు భంగం కలిగించే ఎవరినీ, ఏ చర్యనూ అంగీకరించబోమన్నారు. 'మనమంతా ఐక్యంగా కలిపి రాష్ట్ర హక్కుల కోసం పోరాడుదాం. తమిళనాడు పోరాడుతుంది.. గెలుస్తుంది' అని ఆయన పార్టీ వర్గాలకు పిలుపునిచ్చారు. డీలిమిటేషన్ వల్ల కలిగే దుష్పరిణామాలు, అది రాష్ట్ర ఆత్మగౌరవాన్ని ఎలా దెబ్బ తీస్తున్నది ప్రజలకు వివరించాలని కోరారు. కేంద్రం చర్యలపై తాము చేస్తున్న పోరాటానికి తెలంగాణ, కర్ణాటక, పంజాబ్ రాష్ర్టాల నుంచి మద్దతు వచ్చిందన్నారు.

చాయ్ కొనడానికి హిందీ రావాలి

తమిళనాడులో హిందీ భాషను బలవంతంగా రుద్దడానికి బీజేపీ నేతలు చేస్తున్న ప్రయత్నాలను స్టాలిన్ ఎండగట్టారు. 'ఉత్తరాదిలో మీరు పానీపూరి, టీ కొనడానికి, టాయిలెట్లకు వెళ్లడానికి హిందీ తప్పక అవసరం' అని ఆయన ఎక్స్‌లో వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 'ఈ కృత్రిమ మేధ యుగంలో కూడా పాఠశాలల్లో మూడో భాషగా హిందీ ఉండాలనడం అర్థరహితం. ఇప్పటికే అడ్వాన్స్‌డ్ ట్రాన్స్‌లేషన్ సాంకేతికత భాషా అడ్డంకులను చెరిపేసింది' అని స్టాలిన్ పేర్కొన్నారు.

సిద్ధు.. 'శీష్ మహల్'!

సీఎం అధికారిక నివాసానికి అదనపు హంగులు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ముడా, వాల్మీకి కుంభకోణాలతో సర్వత్రా విమర్శలు మూటగట్టుకొన్న కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా మరో వివాదంలో చిక్కుకొన్నది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారిక నివాసం కావేరి భవనానికి అదనపు హంగులు జోడించడం కోసం ప్రభుత్వం రూ. 2.6 కోట్లను కేటాయించింది.

సొంత ఖర్చుతో చేయించుకోవచ్చుగా!

'ఇండియా టుడే' కథనం ప్రకారం.. కావేరి భవనంలో సీఎం కొత్త సహాయకుడి కోసం ఓ ప్రత్యేక గది నిర్మాణం, ఆ గదికి బాత్‌రూమ్, అదనపు స్టోరేజీ రూమ్స్, ర్యాక్‌లు, కిచెన్ సామాను, కొత్త విద్యుత్తు దీపాలు, వాటర్ ట్యాప్‌లు, ఏసీ తదితరాల కోసం మొత్తంగా రూ. 2.6 కోట్లను ఖర్చు చేయనున్నట్టు ఆర్థిక శాఖ తెలిపింది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనబెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇలాంటి వృథా ఖర్చులు చేయడం దారుణమని బీజేపీ ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్ మండిపడ్డారు. సీఎం సొంత ఖర్చులతో తన నివాసానికి అదనపు హంగులు చేయించుకొంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. సిద్ధూ సర్కారు.. ప్రజాధనాన్ని అభివృద్ధికి వినియోగించకుండా ఇలా ఆడంబరాలకు ఖర్చు చేయడమేంటని విశ్లేషకులు ధ్వజమెత్తుతున్నారు.

అమెరికా అధికార భాషగా ఇంగ్లిష్

ఉత్తర్వులు జారీచేయనున్న ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 28: ఇంగ్లిష్‌ను అమెరికా అధికార భాషగా గుర్తిస్తూ ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర్వులు జారీ చేయబోతున్నారు. ఇందుకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ఆయన మరికొద్ది గంటల్లో సంతకం చేయబోతున్నట్టు తెలిసింది. ఈ నిర్ణయంతో ఫెడరల్ నిధులు పొందేందుకు ఇంగ్లిష్ భాషలో పత్రాలు, సేవలు అందించటం కొనసాగించాలా? వద్దా? అన్నది ప్రభుత్వ ఏజెన్సీలు, ఇతర సంస్థలు తేల్చుకోవడానికి వీలు కలుగుతుంది. 'ఇంగ్లిష్‌ను జాతీయ భాషగా పేర్కొనటం దేశ ఐక్యతను ప్రోత్సహిస్తుంది. ప్రభుత్వ కార్యకలాపాల్లో సామర్థ్యాన్ని పెంచుతుంది. పౌర సంబంధాలకు మార్గం సుగమం చేస్తుంది' అని వైట్‌హౌజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఇంగ్లిష్‌ను అమెరికా అధికార భాషగా గుర్తించాలన్న డిమాండ్ ఇప్పటిది కాదు. 30కుపైగా రాష్ర్టాలు ఇప్పటికే తమ అధికార భాషగా ఇంగ్లిష్‌ను గుర్తించాయి.

స్టాక్‌మార్కెట్ నష్టాలు తట్టుకోలేక యువకుడి ఆత్మహత్య

మహారాష్ట్రలో ఘటన

న్యూఢిల్లీ: స్టాక్‌మార్కెట్ నష్టాలు ఓ 28 ఏండ్ల వ్యక్తి జీవితాన్ని బలిగొన్నాయి. మహారాష్ట్రలోని చాంద్‌వాడ్ తాలూకా విటాయ్‌కు చెందిన రాజేంద్ర కొల్హే ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం మహాశివరాత్రి పర్వదినం వేళ త్రయంబకేశ్వరం ఆలయానికి వెళ్లి.. దేవుడి దర్శనం చేసుకున్న అతడు, తిరుగు ప్రయాణంలో బైక్‌పై కూర్చొని ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. రూ.16 లక్షలు స్టాక్‌మార్కెట్లో నష్టపోవటం, అప్పులు.. ఆర్థిక కష్టాలు రెట్టింపవ్వటం అతడి ఆత్మహత్యకు కారణమని తెలిసింది. స్థానికులు వెంటనే స్పందించి సత్పూర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అతడ్ని వారు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ.. బైక్ సహా కొల్హే శరీరం 90శాతం వరకు మంటల్లో కాలిపోయింది. పోలీసులు అతడ్ని సమీపంలోని జిల్లా దవాఖానకు తరలించారు. తీవ్ర గాయాలైన అతడు బుధవారం రాత్రి మరణించారు. ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలో కొన్నాండ్లు పనిచేసిన కొల్హే, స్టాక్ మార్కెట్ నష్టాల తర్వాత ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగానికి మారినట్టు పోలీసులు చెప్పారు.

రోగాల ఊబిలో ఐటీ ఉద్యోగులు!

హైదరాబాద్, ఫిబ్రవరి 28: రాత్రి, పగలు తేడా లేకుండా గంటల కొద్దీ పని.. పైగా డెడ్ లైన్లతో తీవ్రమైన పని ఒత్తిడి.. వ్యాయామం చేయక పోవడం, అనారోగ్యకరమైన తిండి.. ఇవన్నీ కలిసి ఐటీ ఉద్యోగులను రోగాల ఊబిలోకి నెడుతున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ సాయంతో నిర్వహించిన తాజా అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

ఐటీ ఉద్యోగుల్లో గుర్తించిన రోగాలు

- 84% ఫ్యాటీ లివర్ రోగులు
- 71% ఊబకాయం కలిగిన వారు
- హైబీపీ, డయాబెటిస్‌తో సంబంధమున్న మెటబాలిక్ సిండ్రోమ్ రోగులు 34%

సర్వే చేసిందెక్కడ: హైదరాబాద్

సర్వే చేసింది ఎప్పుడు? జూలై 2023- జూలై 2024 మధ్య

యువ ఉద్యోగుల్లో ఒత్తిడి

రంగం	ఉద్యోగులు
ఐటీ	84.3%
మీడియా	83.5%
బ్యాంకింగ్	80.6%
బీమా	75.5%

అన్ని రంగాల్లో కలిపి ఒత్తిడి ఎదుర్కొంటున్న ఉద్యోగినులు - 74.7%

పని ఒత్తిడి కారణంగా వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌లో రాజీ పడినవారు - 68.25%

అన్ని రంగాల్లో కలిపి ఒత్తిడి ఎదుర్కొంటున్న ఉద్యోగులు - 73.7%

ఆధారం: కేరళ యూత్ కమిషన్

హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులు తప్పనిసరి!

సీబీఎస్‌ఈ టెన్త్ పరీక్షల నూతన విధానంతో అనుమానాలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: దేశంలో హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నానికి కేంద్రం తెరతీసిందా?. అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. వచ్చే ఏడాది నుంచి ఏడాదికి రెండుసార్లు పదో తరగతి బోర్డు పరీక్షలు నిర్వహించనున్నట్టు సీబీఎస్‌ఈ ఇటీవల ముసాయిదా విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో లాంగ్వేజ్ పేపర్లకు సంబంధించి పలు మార్పులు చేసింది. కొత్త విధానం ప్రకారం సబ్జెక్టు గ్రూప్‌లలో ఇంగ్లిష్, హిందీని లాంగ్వేజ్ 1, లాంగ్వేజ్ 2 సబ్జెక్టులుగా పేర్కొన్నారు. ఇతర స్థానిక, విదేశీ భాషలను 'ప్రాంతీయ, విదేశీ భాషా గ్రూప్'లో చేర్చారు. అలాగే హిందీ, ఇంగ్లిష్ పేపర్లకు వేర్వేరు పరీక్ష తేదీలుంటాయి. ఇతర భాషా సబ్జెక్టులకు ఒకే రోజు పరీక్ష జరుగుతుంది. ప్రస్తుతం అమలులో ఉన్న అన్ని సబ్జెక్టులు, లాంగ్వేజ్‌లు 2025-26 విద్యా సంవత్సరంలో కూడా కొనసాగుతాయని సీబీఎస్‌ఈ స్పష్టం చేసింది. ప్రాంతీయ, విదేశీ భాషల గ్రూప్‌లో తెలుగు, కన్నడ, అస్సామీ, పంజాబీ సహా 14 భాషలను చేర్చినట్టు పేర్కొంది. అయితే లాంగ్వేజ్ 1గా ఇంగ్లిష్, లాంగ్వేజ్ 2గా హిందీని ఎందుకు పెట్టింది, మిగిలిన భాషలకు ఆప్షనల్ స్టేటస్‌ను ఎందుకు పెట్టిందో సీబీఎస్‌ఈ వివరణ ఇవ్వలేదు. ప్రస్తుతం అమలవుతున్న సిలబస్‌లో లాంగ్వేజ్ 1, లాంగ్వేజ్ 2 తప్పనిసరి సబ్జెక్టుల జాబితాలో ఉన్నప్పటికీ, విద్యార్థి 38 భాషల్లోంచి తనకు ఇష్టమైన సబ్జెక్టును ఎన్నుకోవచ్చు. కొత్త ముసాయిదాలా ఇంగ్లిష్, హిందీయే ఎన్నుకోవాల్సిన అవసరం లేదు.

పుణె లైంగిక దాడి నిందితుడి అరెస్ట్

ముంబై, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): పుణెలో గత మంగళవారం బస్సులో యువతిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు దత్తాత్రేయ రామ్‌దాస్ గడే(37)ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. 500 మంది పోలీసులు, డాగ్ స్క్వాడ్, డ్రోన్ల నిఘాతో 70 గంటల సెర్చ్ ఆపరేషన్ తర్వాత నిందితుడిని షిరూర్ తాలూకా గుణత్ గ్రామంలోని చెరుకు తోటలో పట్టుకున్నారు. నిందితుడి వేటలో సుమారు 500 మంది గ్రామస్థులు సాయం చేసినట్టు పుణె పోలీస్ కమిషనర్ అమితేశ్ కుమార్ శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. మంచి నీళ్ల కోసం నిందితుడు ఒక వ్యక్తి దగ్గరకు వెళ్లినప్పుడు.. ఆ వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో నిందితుడి అరెస్ట్ సులభమైంది. నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి లక్ష రూపాయల నజరానాను పోలీసులు ప్రకటించారు. ఓ దవాఖానలో పనిచేస్తున్న యువతి(26)ని దత్తాత్రేయ ఓ బస్‌లో రేప్ చేసిన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే.

మగవారి గురించి కూడా ఆలోచించండి!

- *సూసైడ్ వీడియోలో టెకీ ఆవేదన*
- *భార్య వేధింపులతో బలవన్మరణం*

ఆగ్రా, ఫిబ్రవరి 28: దేశంలో మరో భార్య బాధితుడు అర్ధంతరంగా తనువు చాలించాడు. ఈ దేశంలో మగవారిని రక్షించేందుకు చట్టాలు లేవని, తన భార్య చర్యల కారణంగా తాను ఈ ప్రపంచాన్ని వదిలి వెళ్లిపోతున్నానంటూ యూపీలోని ఆగ్రాకు చెందిన ఒక టెకీ ఆత్మహత్య చేసుకున్నాడు. టీసీఎస్‌లో పనిచేసే మానవ్ శర్మ ఈ నెల 24న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే మరణించిన రెండు రోజులకు మానవ్ ఫోన్‌లోని వీడియోను అతని సోదరి గమనించింది. ఆత్మహత్య చేసుకునే ముందు రికార్డు చేసిన వీడియోలో తన భార్యే తన చావుకు కారణమని ఆరోపించాడు. దీంతో మానవ్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడు రికార్డు చేసిన 7 నిమిషాల వీడియోలో 'నా భార్య వేరే వ్యక్తితో సంబంధం పెట్టుకుంది. కానీ నేను ఏం చేయగలను. దయుంచి పురుషుల గురించి ఎవరైనా మాట్లాడాలి. వారు ఒంటరి వారు. చట్టాలు పురుషులను రక్షించాలి' అని పేర్కొన్నాడు. కాగా, తనపై చేసిన ఆరోపణలను భార్య నికిత ఖండించింది.

బంగ్లాదేశ్ విద్యార్థుల కొత్త రాజకీయ పార్టీ

ఢాకా: బంగ్లాదేశ్‌లో శుక్రవారం కొత్తగా ఓ రాజకీయ పార్టీ ఏర్పాటైంది. షేక్ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరుడు నిరసన కార్యక్రమాలను నిర్వహించిన విద్యార్థులు దీనిని ఏర్పాటు చేశారు. భారత్ అనుకూల, పాకిస్థాన్ అనుకూల రాజకీయాలకు ఇక తమ దేశంలో చోటు లేదని ప్రకటించారు. నిరుడు ఈ విద్యార్థులు యాంటీ డిస్క్రిమినేషన్ స్టూడెంట్ మువ్‌మెంట్ లేదా స్టూడెంట్స్ అగెనెస్ట్ డిస్క్రిమినేషన్ పేరుతో ఉద్యమాలు నిర్వహించారు. ఈ సంస్థ జాతీయ నాగరిక్ పార్టీగా మారింది.

స్కైప్ సేవలకు త్వరలో స్వస్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: గత 23 ఏండ్లుగా సేవలందిస్తూ వస్తున్న మైక్రోసాఫ్ట్‌కు చెందిన వీడియో కాన్ఫరెన్సింగ్ ప్లాట్‌ఫామ్ స్కైప్ మే 5 నుంచి తన సేవలకు స్వస్తి పలకనుంది. 'ఈ ఏడాది మే 5 నుంచి స్కైప్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండవు. అయితే మరింతగా ఈ తరహా సేవలు పొందేందుకు వినియోగదారులు మైక్రోసాఫ్ట్ టీమ్స్ (ఉచితం)లోకి మారవచ్చు' అని సంస్థ ఒక ప్రకటనలో కోరింది. ప్రస్తుత స్కైప్ వినియోగదారులు టీమ్స్ వేదికలోకి మారి తమ డాటాను అందులోకి బదిలీ చేసుకోవచ్చునని తెలిపింది. రానున్న మూడు నెలల కాలంలో స్కైప్ నుంచి టీమ్స్‌లోకి తమ వినియోగదారులను మెల్లిగా బదిలీ చేయడానికి మైక్రోసాఫ్ట్ ప్రణాళికలు సిద్ధం చేసింది.అప్పట్లోనే స్కైప్ మనుగడను పలువురు అనుమానించారు. ప్రస్తుతం స్కైప్ ద్వారా ఒకరికి ఒకరు లేదా గ్రూప్‌లకు కాల్స్, మెసేజ్‌లు పంపడంతో పాటు ఫైళ్ల షేరింగ్ చేసుకోవచ్చు.

గుంతల రోడ్లకు ఇక చెల్లు!

తనకు తాను మరమ్మతు చేసుకునే తారు అభివృద్ధి

న్యూఢిల్లీ: రోడ్లపై గుంతలు వాహన చోదకులకు చికాకు కలిగిస్తుంటాయి. వాటిని పూడ్చేందుకు భారీగా నిధులను వెచ్చించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రోడ్ల మరమ్మతులను తక్కువ ఖర్చుతో త్వరగా పూర్తిచేసేందుకు ఉపకరించే పదార్థాల తయారీపై బ్రిటన్ పరిశోధకులు దృష్టిసారించారు. ప్రత్యేకమైన 'సెల్ఫ్-హీలింగ్' తారును అభివృద్ధి చేశారు. కృత్రిమ మేధస్సును ఉపయోగించి బయోమాస్ వ్యర్థాలు, మొక్కల నుంచి సంగ్రహించిన సూక్ష్మ బీజాలతో దీన్ని రూపొందించారు. రోడ్లపై ఏర్పడిన గుంతలు, పగుళ్లను ఎవరి ప్రమేయం లేకుండా తనంతట తానే మరమ్మతు చేయడం ఈ తారు ప్రత్యేకత. స్వాన్సీ యూనివర్సిటీ, లండన్‌లోని కింగ్స్ కాలేజీ, చిలీ శాస్త్రవేత్తలు కలిసి ఈ తారును తయారు చేశారు. బ్రిటన్‌లో రోడ్ల మరమ్మతుల కోసం ఏటా 143.5 మిలియన్ పౌండ్లు (దాదాపు రూ.1,580 కోట్లు) ఖర్చు చేయాల్సి వస్తున్నదని, ఇప్పుడు తాము రూపొందించిన తారు మరింత మన్నికైన 'నెట్-జీరో' రోడ్ల అభివృద్ధికి దోహదం చేస్తుందని స్వాన్సీ యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం తెలిపింది.

చంద్రుడిపై మొబైల్ టవర్!

ఫ్లోరిడా: నాసా అనుకున్న మిషన్ పూర్తయితే చంద్రుడిపైన త్వరలోనే ఫోన్ సిగ్నల్ సేవలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అంటే నేరుగా చంద్రుడి మీద నుంచి భూమ్మీద ఉన్నవారికి వ్యోమగాములు ఫోన్ చేసే అవకాశం రాబోతున్నది! అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి బుధవారం స్పేస్ ఎక్స్ ఫాల్కన్ రాకెట్ ప్రయోగించారు. ఇది ఈ నెల 6న చంద్రుడిని చేరే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన ఐఎమ్-2 మిషన్‌లోని ఎథెనా మూన్ ల్యాండర్ చంద్రుడిపై ఖనిజాలను అన్వేషించడంతో పాటు అక్కడ సెల్యూలార్ నెట్‌వర్క్ సేవల సాధ్యంపై సమగ్ర పరిశోధన చేయనుంది. నోకియా కంపెనీ సాయంతో నాసా చంద్రుడిపై మొబైల్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనుంది. ఇప్పటివరకు రేడియో తరంగాల ద్వారా మాత్రమే చంద్రుడి నుంచి భూమి మీదకు కమ్యూనికేషన్ చేసే అవకాశం ఉండేది. భూమి మీద ఉపయోగించే సెల్యూలార్ సాంకేతికతనే చంద్రుడిపైనా ఉపయోగించవచ్చని ఫిబ్రవరి 2023లో నోకియా ప్రాథమికంగా గుర్తించింది. ఈ నేపథ్యంలో ఈ జనవరిలో చంద్రుడి ఉపరితల కమ్యూనికేషన్ వ్యవస్థ(ఎల్‌ఎస్‌సీఎస్) ను ఎథెనా ల్యాండర్‌లో పొందుపరిచి ఐఎమ్-2 మిషన్‌లో ప్రయోగించినట్టు నోకియా వెల్లడించింది. ఈ వ్యవస్థను ఒక నెట్ వర్క్ బాక్స్‌లో సరిపోయేలా రూపొందించారు.



ప్రపంచంలోనే బుల్లి పార్కు

టోక్యో: వాకింగ్‌కో, పచ్చదనం మధ్య సరదాగా గడపడానికో, సేద తీరడానికో అందరూ పార్కులకు వెళ్తుంటారు. అయితే జపాన్‌లోని షిజువోకా సెంట్రల్ ప్రిఫెక్చర్‌లో ఉన్న ఒక పార్కులో అలాంటి పరిస్థితి లేదు. అక్కడ వాకింగూ చేయలేం, సరదాగా కుటుంబ సభ్యులతో గడపలేం. ఎందుకంటే దాని విస్తీర్ణం కేవలం 2.6 చదరపు అడుగులు మాత్రమే. దీంతో ఇది ప్రపంచంలోనే అతి చిన్న పార్కుగా గిన్నిస్ ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. దాదాపు నాలుగు కాగితపు షీట్ల పరిణామంలో ఉన్న స్థలంలో ఒక రాతి దిమ్మె, దానిపై చెక్కతో తయారు చేసిన స్టూల్, దాని చుట్టూ చిన్న పొద ఏర్పాటు చేసి దానినే పార్కుగా పేర్కొన్నారు. ఈ పార్కు 1988 నుంచి ఉన్నప్పటికీ, ఇటీవలే యంత్రాంగం దానిని అధికారికంగా గుర్తించడంతో అతి చిన్న పార్కుగా గిన్నిస్ రికార్డులకెక్కింది.